ముస్తాబవుతున్న చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి ఆలయం

బ్రహ్మోత్సవాలకు చెర్వుగట్టు ముస్తాబు

- ఈ నెల 14 నుంచి 21 వరకు జాతర

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 12 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 14 నుంచి 21 వరకు జరిగే జాతరకు జిల్లా అధికారులు, దేవాలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ గోపురాలు, చుట్టు పక్కల ఉన్న శివుడు, గణపతి విగ్రహాలకు రంగులు వేసి అలంకరిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాల కల్పనకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. బ్రహ్మోత్సవాలకు సుమారు 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని దేవాలయ సిబ్బంది అంచనా. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ దాసరి హరి చందన అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఘాట్ రోడ్డు వద్ద, గుట్ట కింద రద్దీ ఉన్న ప్రదేశాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మంచి నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు.

నగరోత్సవంతో ప్రారంభం

ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు నల్లగొండలోని రామాలయం నుంచి నగరోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 16న శుక్రవారం రాత్రి(తెల్లవారితే శనివారం17వ తేది) స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 18న ఆదివారం (తెల్లవారితే సోమవారం) స్వామి వారి అగ్నిగుండాలు, 19న సోమవారం(తెల్లవారితే మంగళవారం) దోపోత్సవం, అశ్వవాహన సేవ జరుపుతారు. 20న మంగళవారం రాత్రి మహా పూర్ణాపృతి, పుష్పోత్సవం, ఏకాంత సేవలు నిర్వహిస్తారు. 21న బుధవారం సాయంత్రం 4 గంటలకు గజవాహనంపై చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు పరిపూర్ణం చేస్తారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

జాతరకు వచ్చే భక్తులకు నార్కట్‌పల్లి, నల్లగొండ, యాదగిరిగుట్ట, సూర్యాపేట, దేవరకొండ, కోదాడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపనున్నారు.

నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండకు వెళ్లే ప్రతి సర్వీసు చెర్వుగట్టు మీదుగా నడుపనున్నారు. జాతర సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 15 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, 325 మంది పోలీసులు సిబ్బంది మొత్తం 500 మందితో బందోబస్తు నిర్వహించనున్నారు. గుట్ట పైన, కింద 2 ఔట్ పోస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

గుట్ట పైకి వృద్ధులు, చిన్న పిల్లలను చేరవేసేందుకు 5 ఆటోలను మాత్రమే అనుమతిస్తారు. సీసీ కెమెరాల ఫుటేజీలను చూసేందుకు 2 ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 2 డ్రోన్ కెమెరాలతో గుట్ట పరిసరాలను పర్యవేక్షించనున్నారు. నీటి వసతి, పారిశుధ్యం, మరుగుదొడ్లు, రవాణా తదితర వసతులపై ప్రత్యేక దృష్టి సాధించామని, స్వామి వారి కల్యాణం, తలంబ్రాల బియ్యం సేకరణలో భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ నవీన్ తెలిపారు.

సంస్కారంతో మాట్లాడడం నేర్చుకోండి

- ప్రభుత్వ విప్ అయిలయ్యకు మాజీ ఎమ్మెల్యే సునీత హితవు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 12 : మతిలేని, అవగాహన లేని మాటలు మాట్లాడటం సరైనది కాదని, సంస్కారంతో మాట్లాడటం నేర్చుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదగిరిగుట్టకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాలను కొడంగల్‌కు తరలిస్తున్నట్లు పత్రికల్లో రావడంతోనే తాము స్పందించామని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ స్పందనతో అప్రమత్తమైన స్థానిక ఎమ్మెల్యే అయిలయ్య మెడికల్ కళాశాలను కాపాడుకునే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. దాంతో తమ ప్రభుత్వ హయాంలో మంజూరైన మెడికల్ కళాశాల జిల్లాలోనే ఉంటుందని, ఇది ముమ్మాటికీ తమ విజయమేనని వివరించారు. తాము గుర్తు చేయడం ద్వారానే స్థానిక ఎమ్మెల్యే అప్రమత్తమయ్యారని, తద్వారా మెడికల్ కళాశాల తరలింపు ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అయిలయ్య సంస్కారాన్ని మరిచి మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. తామూ ఎంతో మాట్లాడగలమని, కానీ సంస్కారంతో ఆలోచించి మాట్లాడుతామని హితవు పలికారు. అవగాహనా రాహిత్యంతో ఎవరూ లేరని, సంస్కారవంతమైన కుటుంబంలో పుట్టి పెరిగానని పేర్కొన్నారు.

పదేండ్లు ప్రజలతో మమేకమై పనిచేశామని, 14 సంవత్సరాలు ఉద్యమంలో పని చేశామని గుర్తు చేశారు. కష్టపడి పని చేశానని, డబ్బులు దోచుకోలేదని, నిజాయితీగా ఉంటూ ప్రజలకు సేవ చేశామని పేర్కొన్నారు. ఆత్మబలిదానాలతో సాధించిన తెలంగాణను బాగు చేసుకోవాలన్న కసితో ఉన్నామని, అధికార పార్టీ నాయకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటపడి పని చేయిస్తామని పేర్కొన్నారు. వైద్య కళాశాల యాదగిరిగుట్టలోనే ఉంటుందని తెలిపిన ఎమ్మెల్యేకు, తమ పోరాటానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

త్రిపురారం, ఫిబ్రవరి 12 : మండలంలోని మారమ్మగుడి సెంటర్ వద్ద నుంచి అక్రమంగా రేషన్ తరలిస్తున్న రేషన్ బియ్యం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కె.వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గ్రామాల్లో పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని రాగడప నుంచి అంజనపల్లి వైపు అనుమానంతో ఉన్న అశోక్ లేలాండ్ ను తనిఖీ చేయగా అందులో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న 40బస్తాల(సుమారు 20క్వింటాళ్లు) రేషన్ బియ్యం ఉన్నాయి. వాహనంలో ఉన్న మహిళ, డ్రైవర్‌ను విచారించగా మండలంలోని సీత్యాతండా గ్రామానికి చెందిన ధనావత్ జైపాల్, ధనావత్ సాలమ్మ గ్రామాల్లో ప్రజల వద్ద బియ్యం కొనుగోలు ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

INDUSIND BANK
COMMERCIAL VEHICLE FOR SALE
AL 3718 IL 260 WB
BS4 2019 MODEL
TS29TA0459,
DEAL NO: AVK01449D
Cell No. 9959445310
D.No.797, 1st Floor
Bharath Reddy Complex, Main Road,
Kodada, Suryapet (Dist.), 508206

CHANGE OF NAME
I GADDPATI SUDHAKER, S/o. YADAIAH (OLD NAME) R/O. H.NO.3-4, PANDENAPALLY VILLAGE, KATTANGOOR MANDAL, NALGONDA DISTRICT. VIDE AFFIDAVIT DATED 21/12/2023 SWORN BEFORE NOTARY/ADVOCATE BACHU VENKATARAMANA CHANGED MY NAME GADDAPATI SUDHAKAR S/o. YADAIAH (NEW NAME).

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | మిర్యాలగూడ : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | పాలకుర్తి : 9182777638

బీఆర్ఎస్ బహిరంగ సభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పక్కన పల్లె రవికుమార్, నందికంటి శ్రీధర్

మునుగోడు,ఫిబ్రవరి 12: నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతంచేయాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సభ నియోజకవర్గ సమన్వయకర్త నందికంటి శ్రీధర్, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లెరవికుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కృష్ణాజలాలు కేఆర్ఎంబీపై వాస్తవాలు వివరించేందుకు రాష్ట్ర ప్రజల హక్కుల సాధనే లక్ష్యంగా సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అసత్య ప్రచారాలు చేస్తున్నదని, గత బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను కేఆర్ఎంబీకి అప్పగించడంతో జిల్లా ప్రజలకు అందులో ముఖ్యంగా మునుగోడు నియోజకవర్గ ప్రజలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.నీళ్ల కోసం మళ్లీ పోరాటం చేయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందని దుయ్యబట్టారు. ఫ్లోరైడ్ మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దక్కిందని పేర్కొన్నారు. సభకు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలించేందుకు నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పట్టణ,గ్రామశాఖ అధ్యక్షులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 12 : జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో నేడు నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేవరకొండలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగించడంపై వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు నల్లగొండ నిర్వహించే భారీ బహిరంగకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ హాజరుకానుండడంతో ప్రజలకు వాస్తవాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ప్రజలకు వాస్తవాలను తెలియచేయడం కోసం మంగళవారం నల్లగొండలో నిర్వహించే బీఆర్ఎస్ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సభకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, మహిళలు, రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

గురుకుల పాఠశాలలో పదోన్నతులు పూర్తి చేయాలి

పెద్దవూర :గురుకుల పాఠశాలలో నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవూర, ఫిబ్రవరి 12 : సాంఘిక గురుకుల విద్యా సంస్థలో ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ కంటే ముందే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని ఉపాధ్యాయులు సోమవారం విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఉపాధ్యాయులందరూ సామాజిక సెలవు పెట్టి 317, బదిలీ లను చేపట్టాలని నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో సరిత , వెంకట్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీలత, శ్రీధర్‌రెడ్డి, మాధవి, కరుణ శ్రీ, వినయ్‌కుమార్, పిలింగారెడ్డి , రవీందర్ పాల్గొన్నారు.

గిరిజన గురుకుల ఉపాధ్యాయుల నిరసన

దామరచర్ల : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగ్తా, విజయలలిత, కల్యాణ్‌కుమార్, సరితారెడ్డి, అంజయ్య, నర్సిరెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

తాటికల్ పీఏసీఎస్ తాత్కాలిక చైర్మన్‌గా వెంకటేశ్వర్‌రావు

నకిరేకల్ : బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్‌రావు

నకిరేకల్, ఫిబ్రవరి 12 : తాటికల్ పీఏసీఎస్ తాత్కాలిక చైర్మన్‌గా నాగులంచ వెంకటేశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగించినట్లు సీఈఓ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం తాటికల్ సహకార సంఘం(నకిరేకల్)లో ఆ సంఘ సభ్యులు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఈ నెల 8న పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారని తెలిపారు. వైస్ చైర్మన్‌గా ఉన్న వెంకటేశ్వర్‌రావుకు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ, సంఘం లావాదేవీలు కొనసాగించేందుకు, బ్యాంకు నందు కేవైసీ చేయించేందుకు బాధ్యతలు అప్పగిస్తూ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. సంఘానికి శాశ్వత అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నట్లు జిల్లా సహకార అధికారి నల్లగొండ గారిని కోరుతూ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్‌రావును డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల సుకన్య, సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, ఏసుపాదం, లింగాల వెంకన్న, నకిరేకంటి నరేందర్ పాల్గొన్నారు.

నీలాయిగూడెంలో పరీక్ష సామగ్రి అందిస్తున్న ఎంఈఓ బాలాజీనాయక్

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

త్రిపురారం, ఫిబ్రవరి 12: విస్డం ఫర్ విన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం త్రిపురారం, నీలాయిగూడెం జడ్పీ హైస్కూల్ పదోతరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ బాలాజీ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలలో గత 20 ఏండ్ల క్రితం చదువుకున్న విద్యార్థుల సంస్థగా ఏర్పడి ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్ను లు, సామగ్రిని అందించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం కర్నాటి వెంకటేశ్వర్లు, మొండె వెంకట్, సంస్థ సభ్యులు మడుపు శ్రీనివాస్, రేవూరి దశరథ, పామోజు వెంకటాచారి, అవిరెండ్ల వీరయ్య, ధనావత్ వెంకటేశ్వర్లునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి

నీలగిరి, ఫిబ్రవరి 12 : నల్లగొండ పట్టణ శివారు మర్రిగూడ బైపాస్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన కంబాలపల్లి రేవంత్(21), నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఎర్రా మణికుమార్(21)లు ఎన్‌జీ కళాశాలలో చదువుతూ నల్లగొండలోని వాసం ఉంటున్నారు. ఆదివారం స్నేహితుడి వివాహం సందర్భంగా బరాత్‌లో పాల్గొని రాత్రి చిట్యాల దాబా హోటల్‌కు వెళ్లి తమ బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మర్రిగూడ బైపాస్ వద్ద హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయాలై వారు అక్కడిక్కడే మృతి చెందారు.

తాళం వేసిన షాపులో చోరీ

- రూ.1,55,217 అపహరణ

చౌటుప్పల్, ఫిబ్రవరి12 : తాళం వేసిన షాపులో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని ఇన్‌స్టా కార్ట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ బై ఫ్లిప్‌కార్ట్ టీమ్ లీడర్ పల్లపు మాధవరావు రోజు మాదిరిగా కస్టమర్లకు వస్తువులు డెలివరీ చేయగా వచ్చిన నగదును తన ఆఫీస్‌లోని క్యాష్ లాకర్‌లో భద్రపరిచి షట్టర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా లాకర్‌లోని రూ.1,55,217 నగదు కనిపించలేదు. చోరీ జరగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేసినప్పుడే గుర్తింపు

- ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి

మర్రిగూడ: ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మర్రిగూడ, ఫిబ్రవరి 12 : ప్రభుత్వాధికారులు బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు సూర్యాపేట జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా కార్యాలయంలో ఆయనకు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్,ఎంపీఓ యూసుఫ్, సూపరింటెండెంట్ యాకూబ్, ఏపీఓ వెంకటేశం,ఏఈ యశ్వంత్, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిడమనూరు ఎంపీడీఓ బదిలీ

నిడమనూరు, ఫిబ్రవరి 12 : రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీఓ లను బదిలీల్లో భాగంగా నిడమనూరు ఎంపీడీఓ గా పనిచేస్తున్న కె. ప్రమోద్ కుమార్ యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆరేళ్ల పాటు సేవలందించిన ఆయన బదిలీ పై వెళ్తున్న సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ బోనగిరి రమేశ్, సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ లు వీడ్కోలు పలికారు.

ఉద్యోగాల కల్పనలో మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యం : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నీలగిరి, ఫిబ్రవరి 12 : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యువతరం దేశానికి ఇంధనం, ప్రగతికి రథచక్రం లాంటిదన్నారు. చరిత్రలో ఏ మార్పు సంభవించిన అది ఉరకలెత్తే యువతవల్లే సాధ్యమన్నారు. అలాంటి యువశక్తి నిర్వీర్యమౌతున్నదన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 16 శాతం నిరుద్యోగం పెరిగిందని ధ్వజమెత్తారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓలమాల ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ షరీఫ్, నవీన్, మల్లేశ్, నవీన్, కొండల్, శంకర్, నరేశ్, నాగరాజు పాల్గొన్నారు

శ్రీనివాసుడి కల్యాణానికి సర్వం సిద్ధం

- ముస్తాబైన అవంతీపురం దేవాలయం
- రేపు కల్యాణం-సరస్వతీ దేవి దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసం

మిర్యాలగూడ , ఫిబ్రవరి 12 : మండలంలోని అవంతీపురం కొండలపై శ్రీదేవి భూదేవి సమేతంగా వెలసిన శ్రీనివాసుడి కల్యాణం బుధవారం వైభవంగా ఆలయ కమిటీ నిర్వహించనున్నారు. నేడు స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మూడు రోజులు పాటు జరగనున్నాయి. ఇందుకు కమిటీ దేవాలయానికి రంగులువేయడంతో పాటు ,భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లు వేయించారు.

సరస్వతీ దేవి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

బుధవారం వసంత పంచమి కావడంతో సరస్వతి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు అవంతీపురంలో అమ్మవారి పూజలు జరిపేందుకు దేవాలయ కమిటీ సర్వ సిద్ధం చేసింది. అలాగే సామూహిక అక్షరభ్యాసానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ పేర్కొంది.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 12: మండల కేంద్రంలో యువకులకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు తెలిపారు. ఒడిశాకు చెందిన షేక్ మాజమ్‌అలీ మండల కేంద్రంలోని ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. అయితే గంజాయిని చాక్లెట్ల రూపంలో విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు దాడి చేసి పట్టుకొని ఆయన వద్ద కవర్‌లో 25 గ్రాముల ఎండిన గంజాయితోపాటు 676గ్రాముల చార్మినార్ గోల్డ్ మునక్క అనే పేరుగల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. మాజమ్‌అలీ ఒడిశాలో ఎండు గంజాయిని, గంజాయి చాక్లెట్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి మాడ్గులపల్లిలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం

కట్టంగూర్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైంది. పర్వతం సైదులు కుటుంబం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం భార్యా భర్తలు కూలీ పనులకు వెళ్లగా మధ్యాహ్నం ఒక్కసారిగా మం టలు చెలరేగి పూరి గుడిసెకు అంటుకున్నాయి. ప్రమా దంలో గుడిసెలో సామగ్రి పూర్తి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు.

పోలీస్ శాఖను ప్రజలకు చేరువ చేయడం కోసమే గ్రీవెన్స్‌డే

- ఎస్పీ చందనాదీప్తి

బాధితుల వద్ద వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, ఫిబ్రవరి 12 : పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడం కోసమే గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 40 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులకు స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై వేగంగా స్పందించి పోలీసు సేవలు అందజేయాలన్నారు. బాధితుల ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దవూర ఎస్ఐగా వీరబాబు

పెద్దవూర, ఫిబ్రవరి12 పెద్దవూర ఎస్ఐగా వీరబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న అజ్మీర రమేశ్ బదిలీపై నల్లగొండ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐగా వెళ్లడంతో కొండమల్లేపల్లి ఎస్ఐగా పనిచేస్తున్న పి. వీరాబాబు బదిలీపై ఇక్కడకు వచ్చారు.

చందంపేట, నేరేడుగొమ్ము ఎస్ఐలుగా సతీశ్‌లు

చందంపేట : చందంపే